ప్రజాశక్తి
మంగళవారం 24 జూన్ 2025 5
శ్రీ సత్యసాయి



ఎపిపిఎస్‌సి మెంబర్‌గా జెఎన్‌టియు ప్రొఫెసర్ సి. శశిధర్

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్‌గా అనంతపురం జెఎన్‌టియు మాజీ రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం జెఎన్‌టియులో అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ గా, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, కళాశాల ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్‌గా, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, అనంతపురం జె ఎన్ టియు పరీక్షల విభాగం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా, జె ఎన్ టి యు పాలక మండలి సభ్యులుగా, ఏపీ ఈసెట్ కన్వీనర్ గా, వర్సిటీ జిఎస్ఎస్ డైరెక్టర్‌గా, జె ఎన్ టియు రిజిస్ట్రార్ గా పనిచేశారు. శశిధర్‌ను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ కమిషన్ మెంబర్‌గా నియమించింది. ఈయన ఈ పదవిలో ఆరేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈసందర్భంగా శశిధర్‌కు బోధన, బోధనేతర సిబ్బంది,సహచరులు అభినందనలు తెలియజేశారు.



ప్రొఫెసర్ శశిధర్

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళనలో అంగన్వాడీలు, నాయకులు

ఎన్నికల హామీలు అమలు చేయాలి
సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్న డిమాండ్‌తో జిల్లాలోని అంగన్వాడీలు సోమవారం స్థానిక కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ జిల్లా యూనియన్ కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆందోళనలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెడ్డి శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు గణేష్ సర్కిల్ నుంచి భారీ ర్యాలీగా అంగన్వాడీలు కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ ధర్నాలో నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీలందరూ పేద కుటుంబాల వారని వెనక రూ. 12 లోపే గౌరవేతనం ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. అయితే ప్రభుత్వ పథకాలైన తల్లికి వందనం రేషన్ కార్డులు పించన్లు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఏవి అందడం లేదన్నారు. ఏమని అడిగితే అంగనవాడిలను ప్రభుత్వ ఉద్యోగుల కేటగిరిలో ఉంచారని అంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే అందుకు సరిపడా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహ కూటమి నాయకులు అంగనవాడీల సమస్యలు పరిష్కరిస్తామని సరైన వేతనంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వర్ సరిగా పనిచేయందున ఫోన్లు సరిగా పనిచేయడం లేదని రోజు డేటా పంపాలంటే ఇబ్బందిగా ఉందని అందువల్ల ఎఫ్ ఆర్ ఎస్ ను రద్దు చేయాలని వేతనాలు పెంచాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాగే వ్యవహరిస్తే జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో లక్షలాది కార్మికులు స్త్రీమ్ వర్కర్లు పాల్గొని నిరసన తెలుపుతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఓ విజయ సారధి కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నిసా, జిల్లాలో 12 ప్రాజెక్టుల అధ్యక్ష కార్యదర్శులు, సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, సాంబశివ, దిల్షాద్, పేడపల్లి బాబా, పైపల్లి గంగాద్రి, అంజి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేస్తున్న 'బాబు'

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

చంద్రబాబు ఏడాది పాలన పూర్తి అయినప్పటికీ యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేశారని వైసిపి విద్యార్థి సంఘం, యువజన విభాగం నాయకులు విమర్శించారు. యువత పోరులో భాగంగా వైసిపి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రాష్ట్ర యువజన విభాగం అధికారిక ప్రతినిధి లింగారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతినెల 3 వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏడాది పాలన పూర్తి అయినప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలోని నిరుద్యోగభృతి అమలు చేయలేదన్నారు. బకాయి పడ్డ రూ. 7,200 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న చంద్రబాబు హామీ ఏమైందని ప్రశ్నించారు. విద్యా కానుక, విద్యా వసతి దీవెన అమలు చేయడం లేదని ఎన్నికల ముందు చెప్పిన హామీలు నెరవేర్చకపోతే చంద్రబాబు, లోకేష్ ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. తల్లికి వందనం కింద రూ. 15 వేలు ప్రకారం ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఇస్తామని హామీ ఇచ్చి నేడు రూ.13 వేలు జమ చేశారన్నారు. అందులో కూడా పలువురికి ఇప్పటికీ జమ కాలేదన్నారు. ఇప్పటికైనా హామీలు నెరవేర్చకపోతే రాష్ట్ర యువత తగిన సమయంలో బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒ విజయసారధికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు నాగరాజు, వైసిపి యువజన అధ్యక్షుడు సందీప్ నాయుడు, సతీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసనలో వైసిపి యువజన విభాగం నాయకులు



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో వైసిపి యువజన విభాగం నాయకులు, తదితరులు

సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి - హిందూపురం

ఉద్యోగోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు నిర్వహించాలని హిందూపురం పట్టణంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అర్హత కలిగిన వార్డు సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులుకల్పించిన అనంతరం బదిలీల ప్రక్రియ నిర్వహించాలని కోరారు. జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కల్పించాలని, మాతృశాఖలలో జాబ్ చార్ట్ కల్పించి ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సొంత మండలాల్లో పని చేసుకొనేలా జీవో.నెం.5 సవరించాలని కోరారు. దీనికి తోడు నోషనల్ ఇంక్రిమెంట్స్ కల్పించాలని, 9 నెలల బకాయిలు ఏవైతే ఉన్నాయో వాటిని త్వరితగతిన అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శివరాజ్, వికలాంగుల రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ, ఇతర సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకులు శరణ్, బాబా ఫక్రుద్దీన్, జి.రమేష్, షబ్బీర్, శిల్పారెడ్డి, గౌతమి, సౌజన్య, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

సమ్మె నోటీసు అందజేసిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ విఆర్. రాము మాట్లాడుతూ హిందూపురం మున్సిపాలిటీలో గత 35 సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికులు పట్టణ సుందరీకరణకు సేవలందిస్తున్నారని తెలిపారు. అయితే ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి తలరాతలు మారలేదన్నారు. పర్మినెంట్ చేయాలని చట్టాలు ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనాలను అన్ని రంగాల కార్మికులకు అమలు చేయాలని ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. 20 నుండి 25 సంవత్సరాలుగా మున్సిపాలిటీ ప్రజలకు సేవ చేసినప్పటికీ రిటైర్డ్ అయిన తర్వాత ఒక్క నయా పైసా కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే చనిపోయిన తర్వాత మట్టి ఖర్చులు కూడా ఇవ్వలేని దుస్థితిలో మున్సిపాలిటీలు ఉండడం దురదృష్టకరమని విచారణ వ్యక్తం చేశారు. చనిపోయిన, రిటైర్డ్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కూడా ఇవ్వడం లేదని, ఉన్నంతకాలం వెట్టిచాకిరి చేయించుకోవడం కార్మికులను బానిసలుగా చూడడం తప్ప కార్మిక సేవలను గుర్తించడం లేదని అన్నారు. ఆయా సమస్యలపై మంగళవారం నుండి హిందూపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. అలాగే జులై 9వ తేదీన ఆలిండియా కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి జగదీష్, కోశాధికారి రామచంద్ర, సంయుక్త కార్యదర్శి రామాంజనప్ప, ఉపాధ్యక్షులు చంద్ర, నాయకులు బాబయ్య, మూర్తి, శంకర, చంద్రశేఖర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిఎంహెచ్‌ఒకు ఆశావర్కర్ల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆశా వర్కర్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఫైరోజ్ బేగంకు సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా కార్మిక సమస్యల పట్ల స్పందించలేదని దీంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన ఒప్పందం మేరకు జీవో విడుదల చేయాలని, వేతనాలు పెంచాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో జులై 9వ తేదీ సమ్మె చేయాలని నిర్ణయించామని, అందులో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సాంబశివ, గంగాధర్, శివ, ఫక్రుద్దీన్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు ముంతాజ్, శబరి, అంజనమ్మ, వరలక్ష్మీ, మమత, గంగులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - హిందూపురం

విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మదర్ థెరిసా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్, విద్యాకమిటీ చైర్మన్ అపర్ణ, టీడీపీ నాయకులు ఆదిల్, ఇలియాజ్, శ్రీనివాసులు, షఫీక్, స్టోర్ షఫీ, అబ్దుల్, పి.డి. లోకనాథ్, బూత్ కన్వీనర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

'పురం'లో 27న జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి - హిందూపురం

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు హిందూపురం ఇస్కాన్ కమిటీ సభ్యులు మాధవ ప్రభు తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జగన్నాథ రథయాత్ర బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంచాల మారుతి, పామిశెట్టి శేఖర్, కేతా వెంకటేష్ మాట్లాడారు. పూరి జగన్నాథ రథయాత్ర పురస్కరించుకుని హిందూపురంలో కూడా జగన్నాథ రథయాత్రను నిర్వహించాలని ఇస్కాన్ కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నామా రవి మోహన్ రాజ్, బండారు కిషోర్, మేస్త్రి గంగప్ప, నామ సంకీర్తన దాస్ తదితరులు పాల్గొన్నారు.

సొంతూరుకు చేరిన సౌదీ అరేబియాలో చిక్కుకున్న వ్యక్తి

మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కొన్ని నెలల కిందట ఉపాధి కొరకు సౌదీ అరేబియాకు వెళ్లిన ధర్మవరానికి చెందిన సయ్యద్ ఫరూక్ సొంతూరుకు వచ్చాడు. సౌదీ అరేబియాకు వెళ్లిన ఫరూక్ అక్కడ ఉపాధి లేకపోగా అనేక ఇబ్బందులు పడుతూ తినడానికి తిండి లేక, అనారోగ్యాల పడి ఇబ్బంది పడ్డాడు. పుట్టపర్తికి చెందిన ఓ ప్రైవేటు ఏజెంట్ ద్వారా డ్రైవర్ ఉద్యోగం కోసం సౌదీలోకి వెళ్లిన ఫారుక్ బలవంతపు గృహ పనులు చేయించడమే గాక ఆహారం, నివాసము లేకుండా తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. కనీసం వేతనం కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. దీంతో సయ్యద్ ఫారూఖ్ ఒక వీడియోను సోషల్‌మీడియాల్‌లో పెట్టాడు. ఆ వీడియో వైరల్ కావడంతో ధర్మవరం నియోజకవర్గ మంత్రి ఇన్‌ఛార్జి హరీష్ బాబు సమాచారంతో మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించారు. విదేశాంగ మంత్రి, దేశ రక్షణ మంత్రి తదితరులతో చర్చించి చట్టపరంగా సయ్యద్ ఫరూక్‌ను స్వదేశానికి పిలిపించాడు. ఈనేపథ్యంలో ఫరూక్ సోమవారం ధర్మవరం వచ్చాడు. మంత్రి కార్యాలయానికి వచ్చి మంత్రికి సెల్ ఫోన్ ద్వారా కృతజ్ఞతలు తెలిపాడు, నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు కు నేరుగా కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా బాధితుడు సయ్యద్ ఫరూక్ మాట్లాడుతూ తాను స్వదేశానికి రావటానికి కారణమైన వారికి రుణపడి ఉంటానని అన్నారు.



మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జికి కృతజ్ఞతలు చెబుతున్న బాధితుడు సయ్యద్ ఫరూక్

సాగు భూములు, ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించాలని ధర్నా



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో నాయకులు, బాధితులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సాగుభూములు, ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆవాజ్ మండల నాయకులు అధ్యక్షతన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా సోమందేపల్లి గ్రామ దళితులు, గుడిపల్లి గ్రామానికి చెందిన భూమిలేని పేదలు పందిపర్తి రెవెన్యూ పొలం సర్వే నంబర్-384లోని భూమిలో పంటలు సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. వీరికి అసైన్మెంట్ హక్కులతో పాటు సాగుబడి నమోదు చేయాలని పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదన్నారు. అలాగే నక్కలగుట్టలోని ప్రభుత్వ ఇళ్ల స్థలాలు, లే అవుట్‌లో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. కొందరు ప్రభుత్వ గృహాల కోసం దరఖాస్తులు చేశారన్నారు. వీరందరికీ జీవో-30 ప్రకారం నివాస స్థలాల హక్కులు కల్పించి ప్రభుత్వ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన సిఎస్‌డిటి మోహన్‌నాయక్ మాట్లాడుతూ ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు బెస్త క్రిష్టప్ప, కల్లుగీత కార్మిక సంఘం మండల నాయకులు ఈడిగ రామకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వడ్డే నాగభూషణ, రవి, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు కుమ్మర కిష్టప్ప, నేసే నాగరాజు, కెవిపిఎస్ మండల నాయకులు గోవిందప్ప, సాగుదారులు ఊటుకూరు కిష్ట, అంజి, సరోజమ్మ, వెంకటలక్ష్మి, శివమ్మ, నాగమ్మ, పేదలు అలివేలమ్మ, షహీనా, రాజేశ్వరి, జయమ్మ, లలిత, సరస్వతి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

బడిబస్సు లేక ఆదర్శ పాఠశాల విద్యార్థులు అవస్థలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

బడిబస్సు సౌకర్యం లేక మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ఉదయం సమయానికి పాఠశాలకు చేరుకోలేక, సాయంత్రం పాఠశాల నుంచి తిరిగి ఇంటికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. బస్సులు తిరిగే ప్రధాన రహదారికి కిలోమీటర్ దూరంలో పాఠశాల ఉండడంతో విద్యార్థులు పుస్తకాలు మోస్తూ అక్కడికి చేరుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. గత విద్యా సంవత్సరంలో ఆర్టీసీకి చెందిన బడి బస్సు పాఠశాల వద్దకే వస్తుండేదని, వేసవి సెలవుల అనంతరం పాఠశాల వద్దకు బస్సు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు పాసులు చెల్లించినా ఆర్టీసీ యాజమాన్యం బస్సు పంపడం లేదన్నారు. కొత్తచెరువుకి వెళ్లాల్సిన విద్యార్థులు కిలోమీటర్ నడిచి వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోందన్నారు. ఇకనైనా ఆర్టీసీ యాజమాన్యం స్పందించి బడి బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో బడి బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

చంటిబిడ్డలతో భిక్షాటన చేస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-కదిరి టౌన్

చంటి బిడ్డలతో భిక్షాటన చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. పట్టణంలో చంటి బిడ్డలను ఎత్తుకుని భిక్షాటన చేస్తున్న మహిళలను సోమవారం సమత స్వచ్ఛంధ సంస్థ సభ్యులు, పోలీసులు కలిసి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అలాగే భిక్షాటన చేస్తున్న 11 ఏళ్ల బాలికను రక్షించారు. సిఐ మాట్లాడుతూ తల్లిదండ్రులైనా సరే తమ బిడ్డలను చట్ట వ్యతిరేక పనులకు ఉపయోగించడం నేరమన్నారు. అతిక్రమిస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తారన్నారు. అలాగే వారి వద్ద ఉన్న బిడ్డలందరూ వారి బిడ్డలే అని నిర్ధారణ చేసుకున్నాక సిఐ వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. వారిలో నంద్యాలకు చెందిన వారు నలుగురు, బనగానపల్లికి చెందినవారు ఒకరు, గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన వారు ఒకరు ఉన్నారు. వీరందరూ కదిరి పరిసర ప్రాంతాల్లో గుడారాలు వేసుకొని జీవిస్తున్నారు. రెండు రోజుల్లో కదిరి పట్టణం విడిచి మీ స్వగ్రామాలకు వెళ్లి భిక్షాటన కాకుండా ఇతర పనులు చేసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సమత స్వచ్ఛంధ సంస్థ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు, సిబ్బంది బాబ్‌జాన్, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

దారికి అడ్డంగా మెట్లు.. రాకపోకలకు ఇక్కట్లు

ప్రజాశక్తి - హిందూపురం

మున్సిపల్ నిబంధనలకు తిలోదకాలిచ్చి ఓ వ్యక్తి తన స్వార్థ ప్రయోజనాల కోసం సిమెంట్ రహదారిపైన ఐరన్ మెట్లు ఏర్పాటు చేసిన సంఘటన పట్టణంలోని ప్రయివేటు బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. ఒకవేళ మున్సిపల్ అధికారులు చూసినా ఏమి చేస్తారులే అన్న ధీమాతో స్థానికుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హిందూపురం పట్టణంలోని ప్రయివేటు బస్టాండ్ సమీపంలో వాణిజ్య సముదాయ భవన యజమానులు అక్రమంగా బిల్డింగ్ పైభాగానికి వెళ్లడానికి కింది భాగంలోఉన్న రహదారిపైనే ఇనుప మెట్లు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు వాపోతున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన మెట్లు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో అటు, ఇటు వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రహదారిపై వచ్చే వ్యక్తులకు మెట్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం కూడా లేకపోలేదు. నిత్యం రద్దీగా ఉండే రహదారికి అడ్డంగా రాత్రికి రాత్రే ఇనుపమెట్లు ఏర్పాటు చేయడంతో రాకపోకల ప్రజలతో పాటు వాణిజ భావన సముదాయంలో ఉన్న దుకాణదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన మెట్లను తొలగించి రాకపోకలకు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



దారికి అడ్డంగా ఏర్పాటు చేసిన ఇనుప మెట్లు

బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్‌పర్సన్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని మార్కెట్ యార్డ్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా అంబటి అరుణశ్రీ బాధ్యతలు స్వీకరించారు. ఆమెతో పాటు 17 మంది సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఛైర్‌పర్సన్‌గా అంబటి అరుణశ్రీ, వైస్ ఛైర్మన్‌గా ఎం.అయ్యప్ప, సభ్యులుగా కె.అచ్చమ్మ, సాకే ఓబులేష్, సి.రాములమ్మ, కొంకా నాగార్జున, కె.రవీంద్ర, కె.సాంబశివనాయక్, బి.వాణి, ఎం.నాగమణి, ఎన్.ఆజాద్‌బాబు, టి.రాఘవరెడ్డి, వి.నాగూర్‌బి, జి.పద్మనాభన్, టి.నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, రైతులకు అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అంబటి సతీష్, సంధిరెడ్డి శ్రీనివాసరెడ్డి, హరీష్‌బాబు, డోలా రాజారెడ్డి, గొట్లూరు చంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, ఇంజనీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొగ్గు నాగరాజు, జయకృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్,హెల్త్ అలవెన్సులు, జీవో-36 ప్రకారం వేతనాలు, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ర్యాలీలో సిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ, ఎస్.హైదర్‌వలి, కార్మిక సంఘం నాయకులు అనిల్, కాటమయ్య, యోగి, దస్తగిరి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ర్యాలీలో పాల్గొన్న సిఐటియు నాయకులు

అసాంఘిక శక్తులను ఉపేక్షించం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు యంత్రాంగం పని చేస్తుందని, అసాంఘిక శక్తులను ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎస్పీ వి.రత్న సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లాలో ఇటీవల కాలంలో పటిష్టమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌తో నేరాలు తగ్గుముఖం పట్టేలా పోలీసు వ్యవస్థ పని చేస్తోందన్నారు. ఆర్థిక నేరాలు, గొడవలు, దౌర్జన్యాలు, మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు చట్ట పరిధిలో విచారించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇటీవల కొత్త చెరువులో చోటుచేసుకున్న ఓ స్థల వివాదంలో మొరంశెట్టి పాండు కీలక సూత్రధారి కావడంతో పాటు వ్యాపారాలు, కంపెనీల పేరుతో ఆర్థిక నేరాలు, మోసాలకు పాల్పడి పలువురిని మోసగించారని బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. అతడిపై వివిధ రాష్ట్రాల్లో ఆర్థిక నేరాలు, మోసాలకు పాల్పడిన ఘటనల్లో ఇప్పటికే 488 పైగా కేసులు నమోదయ్యాయన్నారు. అతని గత చరిత్ర, నేరాల ఆధారంగా అరెస్టు చేసి విచారించగా మోసాలను అంగీకరించారన్నారు. పోలీసులు ఎక్కడా ఎవరినీ ఇబ్బందులకు గురి చేయలేదన్నారు. నిందితుడిని ఆదివారం అరెస్టు చేసి వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు పంపామన్నారు. కొందరు పోలీసులపై నిరాధార ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని ఎస్పీ ఆ ప్రకటనలో తెలిపారు.





రోటరీ క్లబ్ - డి.నాగభూషణ, పి.విజయభాస్కర్, కె.నరేందర్‌రెడ్డి | ఇన్నర్ వీల్‌క్లబ్ - సుమలత, ఎ.లక్ష్మి, కె.రాజేశ్వరి

రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ నూతన కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని సాంస్కృతిక మండలిలో 2025-26 సంవత్సరానికి గాను రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్‌లకు నూతన కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ డిజి ఈ.శేఖర్‌రెడ్డి, పిడిజి చిన్నపరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ సుమంత్ నంబూరి హాజరై నూతన కార్యవర్గాల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులుగా డి.నాగభూషణ, కార్యదర్శిగా పి.విజయభాస్కర్, కోశాధికారిగా కె.నరేందర్‌రెడ్డిల ను ఎన్నుకున్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఛైర్మన్ సుమిత్ర రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యుల చేత ప్రతిజ్ఞ చేయించగా అనంతరం సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షులుగా డాక్టర్ సుమలత, కార్యదర్శిగా ఎ.లక్ష్మి, కోశాధికారిగా కె.రాజేశ్వరి, ఐఎస్‌ఒగా అంబటి అరుణశ్రీ, ఈఎస్ఒగా కె.పద్మ, ఆగ్జలైంగ్ ఆఫీసర్‌గా గట్టు నాగరత్నంను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ మరింత ముందు కెళ్తామన్నారు. కార్యక్రమంలో జయసింహ, రత్నశేఖర్ రెడ్డి, వెంకటేశులు, ప్రసన్నకుమార్, అంబటి సతీష్, పెద్దిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రమేష్‌బాబు, శివయ్య, బివి.చలం, గట్టు హరినాథ్, పెద్దారెడ్డి, నాగరత్న, భాగ్యలక్ష్మి, పద్మావతి, సంకారపు జయశ్రీ, సరస్వతమ్మ, జగ్గా కళావతి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వేగవంతంగా, అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలను పరిష్కరించాలని డిఆర్ఒ విజయసారథి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డిఆర్ఒ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా డిఆర్ఒతో పాటు ఆర్డీవో సువర్ణ, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, ఇతర అధికారులు పాల్గొని మొత్తం 212 అర్జీలు స్వీకరించారు. డిఆర్ఒ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఫైరోజ్‌బేగం, ఎపిఎంఐపి పిడి సుదర్శన్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల జెడిలు సుబ్బారావు, చంద్రశేఖర్‌రెడ్డి, శుభదాస్, ఆర్టీసీ ఆర్‌ఎం మధుసూదన్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఒ విజయసారథి

భూ కబ్జాదారులపై ఫిర్యాదు


పుట్టపర్తి క్రైమ్ : పెనుకొండ గ్రామ పొలంలోని తమ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేశారని వారి నుంచి న్యాయం చేయాలని పెనుకొండ మండలంలోని కొండాపురం గ్రామస్తుడు జె.రవీంద్రరెడ్డి డిఆర్ఒ విజయసారథికి విన్నవించారు.

ఇళ్లు మంజూరు చేయాలని వినతి

నంబులపూలకుంట : కూటమి ప్రభుత్వం తక్షణమే నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ దేవేందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు నాగరాజు మాట్లాడుతూ మండలంలో నిరుపేదలను గుర్తించి ఇంటి పట్టాలతో సహా గృహాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగిరెడ్డి, మల్‌రెడ్డి, నాగార్జున, బావాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

ఎంఇఒపై చర్యలకు డిమాండ్


ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో నిబంధనలు పాటించని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎన్ఎస్‌యుఐ, పిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు ఉపేంద్ర, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి బుక్స్, యునిఫామ్స్, టై, బెల్ట్, షూ, తదితర స్టేషనరీ విక్రయిస్తున్నారని, ఫీజులు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాల బస్సులు కండిషన్‌లో లేవన్నారు. అయినా ఎంఇఒ ఆయా విద్యా సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేష్, లోకేష్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-మడకశిర

సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం లో నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమన, కన్యాకుమారి మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున స్థలం ఇచ్చి రూ. 5లక్షలతో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఏడాదైనా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అలాగే ప్రతి మహిళకు నగదు, తదితర హామీలను విస్మరించిందన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో పాటు ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పరుశరాముడు, శివకుమార్, రత్నమ్మ, మురళి, అంజలి, నాగరత్నమ్మ, వంశీ, అనసూయమ్మ, పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

భూ సేకరణ ఆపాల్సిందే..

ప్రజాశక్తి-చిలమత్తూరు

సెజ్‌ల పేరుతో మండలంలో భూసేకరణ ఆపాలని, ఇంతకుముందు తీసుకున్న భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతూ వీరాపురం గ్రామ రైతులు సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ సెజ్‌ల పేరుతో మండల వ్యాప్తంగా రైతుల నుంచి భూములు తీసుకొని ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయక పోగా మళ్లీ ఇప్పుడు భూసేకరణ చేపట్టడం అన్యాయమన్నారు. సైబీరియన్ పక్షుల పరిరక్షణకు సంబంధించి గతంలో ఈ ప్రాంతాన్ని భూసేకరణ జాబితా నుంచి తొలగించారన్నారు. తాజాగా పరిశ్రమల పేరుతో భూసేకరణకు పాల్పడడం తగదన్నారు. ఈ ప్రాంతాన్ని బయోలాజికల్ హెరిటేజ్ హబ్‌గా గుర్తించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, భూసేకరణ నుంచి మినహాయించాలని కోరారు. అలాగే ఇప్పటికే రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు స్థాపించాలని కోరారు. కార్యక్రమం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, రామచంద్ర, ఆనంద్, రైతులు గంగప్ప, ఆదినారాయణప్ప ఆదిలక్ష్మి, నరసమ్మ, గంగద్రి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

మహిళల భద్రతకు 'శక్తి' యాప్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను రూపొందించారని, అత్యవసర సమయంలో మహిళలు ఈ యాప్‌ను వినియోగించుకోవాలని పోలీసులు తెలిపారు. మహిళా స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో సోమవారం శక్తి బృందాలు బాలికలు, మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ మహిళ శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి మొబైల్ నెంబర్ కంట్రోల్ రూమ్‌కి కనెక్ట్ అవుతుందన్నారు. ప్రమాదంలో కానీ అత్యవసర సమాయాల్లో మొబైల్‌ను 5 సార్లు షేక్ చేస్తే ప్రమాదంలో ఉన్నట్లు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందన్నారు. 5 నిమిషాల్లో పోలీసులు బాధిత మహిళల వద్దకు వచ్చి సాయం చేస్తారని వెల్లడించారు. ఈ యాప్‌లో ఇంట్లో నుంచే ఫిర్యాదు చేయవచ్చన్నారు. శక్తి టీం పనితీరు, శక్తి ఎస్ఒఎస్, యాప్ ఉపయోగాలు, బాల్య వివాహాలు, వరకట్నం, లైంగిక వేధింపులు, ఈవ్ టీజింగ్, డయల్ 112, 181, చైల్డ్ లైన్ 1098, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెం 1930 ఉపయోగాలు, మోసాలు, సోషల్ మీడియా ప్రభావం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు.



శక్తి యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టిడిపి పటిష్టత కోసమే సంస్థాగత కమిటీలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

టిడిపి పటిష్టత కోసమే సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఎన్నికల పరిశీలకులు రంగేపల్లి వెంకటరమణ తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు సోమవారం స్థానిక గాంధీనగర్ సర్కిల్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. వెంకటరమణ మాట్లాడుతూ కోటి సభ్యత్వాలతో ధర్మవరం నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రత్యేకత కలిగి ఉందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ధర్మవరంలో హత్యలు, దౌర్జన్యాలను ఎదుర్కొన్న వ్యక్తి పరిటాల రవీంద్ర అని, ఇలాంటి నియోజకవర్గంలో టిడిపి మరింత బలోపేతం కావాలన్నారు. పట్టణంలోని 40 వార్డులకు వార్డు కమిటీలు, పట్టణ కమిటీలు, పట్టణ అనుబంధ సంఘాల కమిటీలు ఎన్నుకుంటామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని ఎంపిక చేస్తామన్నారు. పదవులు రానివారు నిరుత్సాహపడవద్దని నియోజకవర్గ పార్టీ అనుబంధ సంఘాలు, పట్టణ పార్టీ అనుబంధ సంఘాల్లో అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఏడుగురికి మంజూరైన రూ. 4,60,656 చెక్కులను అందజేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, మహేష్ చౌదరి, కమతం కాటమయ్య, పట్టణంలోని 40 వార్డు అధ్యక్షులు, వార్డు కమిటీ మెంబర్లు, క్లస్టర్, యూనిట్, సెక్షన్ ఇన్‌ఛార్జులు, కుటుంబ సాధికారిక సారథులు, భూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి సంస్థాగత ఎన్నికలపై సమావేశమైన నాయకులు

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-తనకల్లు

స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కెజిబివి, బిసి హాస్టల్‌లో సోమవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, సూపర్వైజర్ మహబూబ్ బాషా విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మలేరియా నివారణ మందు పిచికారి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా, దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాల న్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మేరీ, హెల్త్ అసిస్టెంట్ ముసల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దేశనాయక్, ఎంఎల్‌హెచ్‌పి అయేషా, పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక కెజిబివి, బిసి హాస్టల్‌లో సూపర్వైజర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మలేరియా మందు పిచికారి చేయించారు.

బత్తలపల్లి : సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ డ్రై డే ఫ్రైడే తప్పక పాటించాలని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ సూచించారు. వైద్య సిబ్బందితో కలిసి బత్తలపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజశేఖర్, మారుతి, ఎఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు సాయిలీల, నారాయణమ్మ, పర్వీనా, ఆషియా పాల్గొన్నారు.

తనకల్లు తహశీల్దార్‌గా సయ్యద్ షాబుద్దీన్

తనకల్లు : మండల నూతన తహశీల్దార్‌గా సయ్యద్‌షాబుద్దీన్ సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బుక్కపట్నం మండల తహశీల్దార్‌గా పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్ జిపి.శోభాసువర్ణమ్మ రొళ్ల మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన తహశీల్దార్‌కు ఆర్ఐ అశోక్, డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జున, కార్యాలయ సిబ్బంది పూలబొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.

హౌసింగ్ ఏఈగా నరేష్

లేపాక్షి : మండలం గృహ నిర్మాణ శాఖ నూతన ఏఈగా సోమవారం కురుబ నరేష్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడే వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన నరేష్ ఉద్యోగోన్నతి పొంది ఇక్కడే ఏఈగా చేరారు. ఆయన మాట్లాడుతూ మండలం లోని లబ్ధిదారులకు అందుబాటులో ఉండి ఇల్లు లేని వారిని గుర్తించి ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయిస్తామన్నారు. ఆయనకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



26న వాహనాల వేలం

తనకల్లు : మండలంలోని పరాకువాండ్లపల్లిలో ఉన్న తనకల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్, మద్యం అక్రమ రవాణా, తదితర కేసుల్లో జప్తు చేయబడిన వాహనాలను ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు సిఐ మారుతిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ. 2వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చు అని సిఐ తెలిపారు.

టిడిపి నూతన కమిటీలు ఎన్నిక

కదిరి టౌన్ : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో 14, 17, 18, 34, 36వ వార్డులకు కమిటీలను ఎన్నుకొన్నారు. ఆయా వార్డుల ఇన్‌ఛార్జులు మహబూబ్‌బాషా, సావిత్రమ్మ, ఇర్ఫాన్ ఫరూక్, శ్రీరాములు, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షులు హరినాథ్ ఆధ్వర్యంలో నూతన కమిటీలను నియమించారు. ఆయా వార్డుల అధ్యక్షులుగా ఇమామ్, అక్రమ్ మౌలానా, జెకె.జాఫర్‌అలీ, నరసింహులు, గంగన్నలను ఎన్నుకున్నారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్ పీరా, ఇలియాజ్, నూర్, గంగిశెట్టి, హేమద్రి, శ్రీనివాసులు, రవి, వేమనారాయణ పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక పశువైద్య కార్యాలయంలో సోమవారం పాడి రైతులకు 50 శాతం రాయితీపై దాణా అందజేసినట్లు పశువైద్యాధికారి బి.చెన్నకేశవనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుమారు 125 మంది రైతులకు 123 బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. పశువులకు ఈ దాణా పెట్టడం వల్ల పాల శాతం పెరిగి తద్వారా పాడి రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి వి.ప్రసాద్, ఉప సర్పంచి లక్ష్మం నర్సారెడ్డి, ఎస్.అక్రమబాషా, సచివాలయ సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్ సాయి కుమార్‌నాయక్, రైతులు రామచంద్ర, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన మహిళలకు సోమవారం ముస్లిం మైనార్టీలు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించారు. ముస్లిం మైనార్టీలు ప్రతినెలా మూడో వారంలో గర్భిణులకు అన్నదానం ఏర్పాటు చేస్తారు. కార్యక్రమంలో మండల వైద్యులు ఓంకార్, ఆయిషా తస్నీమ్, జామీయా మసీదు కార్యదర్శి, మేస్త్రీ అక్రమ్ బాషా, ముతవల్లి మహమ్మద్, కుళ్లాయప్ప, అన్సర్ బాషా, హాజీ అక్బర్, గోల్డ్ షాప్ షాషా, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం బాధ్యత కార్యదర్శులదే

ప్రజాశక్తి-బత్తలపల్లి

గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ గ్రామ కార్యదర్శులదే బాధ్యత అని ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన ఈఓఆర్డీ క్రిష్టప్ప, పరిపాలన అధికారి శ్రీనివాసులుతో కలిసి స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. పలు అంశాలపైన వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జ్యోతి, ఏపీఓ ఆదెప్ప, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

సచివాలయ ఉద్యోగులకు సొంత మండలంలో బదిలీలకు అవకాశం కల్పించాలని కోరుతూ సచివాలయ సిబ్బంది సోమవారం ఎంపిడిఒకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం ఉద్యోగంలో చేరామని, కావున సొంత మండలంలో బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. అలాగే పెండింగ్లో ఉన్న నోషనల్ ఇంక్రిమెంట్స్ త్వరగా మంజూరు చేయాలని, ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యమని ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ కుఫ్రా తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 4 దరఖాస్తులు అందాయి. ఆయా అర్జీలపై సంబంధిత మండల అధికారులతో విచారణ చేపట్టి తప్పక న్యాయం చేస్తామని తెలిపారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకి ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వై.ప్రశాంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.

నేరాలు ఘోరాలు

సెంట్రింగ్ కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

తండ్రి మందలించాడని మనస్థాపం చెంది యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కనగానపల్లి మండలంలోని దాదులూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. దాదులూరు గ్రామానికి చెందిన కేశవయ్య కుమారుడు నరేష్(20) సెంట్రింగ్ పని చేసేవాడు. కొన్ని రోజుల నుంచి పనికి సరిగా వెళ్లక పోవడంతో తండ్రి కేశవయ్య మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన నరేష్ సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరేష్‌కు ఇంకా పెళ్లి కాలేదు. ఈ సంఘటపైప కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన సుధాకర్(27) సోమవారం తెల్లవారుజామున అనంతపురం రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తూ రైలు కిందపడి మృతి చెందాడు. అనంతపురం రైల్వే హెచ్‌సి విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. అనంతపురం రైల్వేస్టేషన్‌లో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందన్నారు. అతడి వద్ద ఉన్న పర్సులో ఫొటో, ఆధార్‌కార్డు ఆధారంగా ఆత్మకూరు గ్రామానికి చెందిన కల్లే శ్రీరాములు కుమారుడు కల్లే సుధాకర్‌గా గుర్తించామ న్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా కుటుంబ సభ్యులు అక్కడి చేరుకుని బోరున విలపించారు. కల్లే సుధాకర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తిరుపతి దర్శనానికి వెళ్తున్నట్లు స్నేహితులు, కుటుంబ సభ్యులకు తెలిపాడు. అనంతపురం నుంచి తిరుపతికి రైలులో వెళ్లడానికి ముందుగానే స్టేషన్‌కు చేరుకున్నాడు. అయితే ఇంకా సమయం ఉండడంతో కాసేపు నిద్రపోయాడు. అయితే ఒక్కసారిగా మెలకువ రావడంతో నిద్రమత్తులో పొరపడి తిరుపతి రైలు అనుకుని కదులుతోన్న రైలును ఎక్కబోయి ప్రమాదవశాత్తూ జారి రైలు కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

బైక్‌కు నిప్పు

రొద్దం : మండలంలోని పి.రొప్పాల గ్రామానికి చెందిన ఎం.నరసింహ మూర్తికి చెందిన హోండా షైన్ బైక్‌కు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. వివరాలు.. నరసింహమూర్తి ప్రతిరోజు రొప్పాల సమీపంలో ఉన్న పెన్నా నదిలో ఇసుక ట్రాక్టర్ లోడ్ చేసే పనికి వెళ్లేవాడు. ఈ క్రమంలో సోమవారం పనికి వెళ్లిన అతడు పెన్నా నది సమీపంలోని మామిడి చెట్టు కింద బైక్‌పై వదిలి వెళ్లారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. 3 నెలల క్రితం రూ. లక్షకు పైగా పెట్టి కొనుగోలు చేసిన నూతన బైక్ ఇలా కాలి బూడిదవడంతో బాధితుడు లబోదిబోమన్నాడు.

26న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మడకశిర పట్టణంలో ఈ నెల 26వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి బండ్ల హరికృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. జాబ్‌మేళాలో 20 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 38 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వివరాలకు 99666 82246లో సంప్రదించాలన్నారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో తాగునీరు సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్నపల్లి వద్ద నుంచి పట్టణంలోని కదిరి గేటు రోడ్డు విస్తరణలో పనుల్లో భాగంగా ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ వారు పనులు చేపడతారని దీంతో రెండు రోజులు నీటి సరఫరా ఆపి వేయాల్సి వచ్చిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నేసేపేట, పిఆర్‌టి వీధి, లింగిశెట్టి పాలెం, మార్కెట్ ఏరియా, సిద్దయ్యగుట్ట, యాదవవీధి, బ్రాహ్మణవీధి, లోనికోట, బోయవీధి, జెజెఆర్ నగర్, ఇందిరానగర్, సాయినగర్, ఎర్రగుంట సర్కిల్, ప్రియాంక నగర్‌లో నీటి సరఫరా ఉండదని, పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

చిలమత్తూరు : మేజర్ గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగం చేశారని, దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వైసిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో డిపిఒకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం చేశారన్నారు. ఇంటి, నీటి పన్నులు, బిల్డింగ్ అప్రూవల్ ద్వారా సమకూరిన పంచాయితీ నిధులను చేయని పనులకు ఇష్టారాజ్యంగా డ్రా చేశారన్నారు. వసూలు చేసిన పన్నుల వివరాలు అడిగినా సమాధానం దాట వేస్తున్నారన్నారు. నిధుల దుర్వినియోగంపై వెంటనే చర్యలు తీసుకోవాలనీ ఆయన డిపిఒను కోరారు.

ప్రతిభా విద్యార్థులకు సన్మానం

కొత్తచెరువు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం కళాశాలలో సత్కరించారు. ప్రిన్సిపల్ జ్యోతిర్లత విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో బాగా చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీనియర్ బైపీసీలో లతీఫ్, ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకు సాధించారని, ఎంపీసీలో నవరత్న అమరావతిలోని విట్ కళాశాలలో సీటు సాధించిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణస్వామి, చంద్రమౌళి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

రొద్దం : మండలంలోని నారనాగేపల్లి ప్రభుత్వ హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్తున్న ఐదుగురు ఉపాధ్యాయులను సోమవారం హెచ్‌ఎం భాగ్యలక్ష్మిదేవి ఆధ్వర్యంలో సిబ్బంది సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఎన్.రాజశేఖర్, మహేష్, నరహరి, శివయ్య, శ్రీనివాస్‌రెడ్డిలను పూలమాలలు, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బదిలీ ఉపాధ్యాయులను సన్మానించిన తోటి ఉపాధ్యాయులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లిలో సోమవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టగా పలువురు సభ్యత్వం తీసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎపిడబ్ల్యుజెఎఫ్ జర్నలిస్టుల సమస్యలపై పలు పోరాటాలు చేసి విజయం సాధించిందని, ఇకపై కూడా జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నవీన్‌కుమార్, పెనుకొండ నియోజకవర్గ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, నాయకులు ఎస్ఆర్.శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, పాత్రికేయులు ఆదినారాయణ, బి.శ్రీనివాసులు, హరి, రఘు, వడ్డే శ్రీనివాసులు, మనోహర్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిన ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు